సాక్షి
నిజామాబాద్

శుక్రవారం । 12 । జనవరి । 2024



పతంగులతో జాగ్రత్త..

పండుగ వేళ చైనామాంజా హవా నడుస్తోంది. ఈ మాంజాతో చిన్నారులకు ప్రమాదం పొంచి ఉంది.

- 8లో ▸



దళితబంధు నిధులివ్వండి

రెండోవిడతలో దళితబంధు స్కీంకు ఎంపికైన వారికి నిధులివ్వాలని కోరుతూ లబ్ధిదారులు కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.9 /21.2

ఆకాశం ఉదయం నుంచి మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశముంది. మధ్యాహ్నం నుంచి చల్లటిగాలులు వీస్తాయి. రాత్రి చలితీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మొరాయించిన రైల్వేగేట్

- రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం

మాక్లూర్ : మండలంలోని 63వ నంబర్ జాతీయ రహదారిపై అడవి మామిడిపల్లి రైల్వే గేట్ సిగ్నల్ వద్ద గురువారం ఉదయం వేసిన రైల్వేగేట్ తిరిగి తెరుచుకోకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రెండు గంటల పాటు గేట్ తెరుచుకోలేదు. దీంతో కొందరు వాహనదారులు రైల్వే సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ట్రాఫిక్‌కు ఏర్పడిన అంతరాయాన్ని గుర్తించిన స్థానిక సర్పంచ్ చింత మల్లారెడ్డి తన సహచరులతో ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు ప్రయత్నించారు. చివరకు గత్యంతరం లేక జేసీబీతో గేట్లు ఎత్తారు. దీంతో ఇరువైపులా 5కి.మీ మేర వాహనాలు నిలిచిపోగా ట్రాఫిక్ క్లియర్ అయ్యేందుకు మరోగంటల సమయం పట్టింది.

హైకోర్టును ఆశ్రయించిన మున్సిపల్ చైర్‌పర్సన్..!

ఆర్మూర్ : ఆర్మూర్ మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొన్న చైర్‌పర్సన్ పండిత్ వినీత హైకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. 36మంది కౌన్సిలర్లు ఉన్న మున్సిపాలిటీలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా సభ్యత్వాన్ని తీసుకున్నారు. దీంతో కౌన్సిలర్ల సంఖ్య 37కు చేరింది. అయితే ఈనెల 4వ తేదీన ఆర్డీవో వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవిశ్వాస తీర్మాన సమావేశానికి కోరం సభ్యులు 25 మంది హాజరయ్యారు. కాగా కేవలం 24 మంది కౌన్సిలర్లు మాత్రమే తీర్మానానికి అనుకూలంగా చేయి ఎత్తారని ఎక్స్‌అఫీషియోగా ఉన్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి చేయి ఎత్తలేదని దీంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లేనని తననే చైర్‌పర్సన్‌గా కొనసాగించాలని కోరుతూ చైర్‌పర్సన్ పండిత్ వినీత హైకోర్టులో రిట్ పిటిషన్ వేసినట్లు సమాచారం. మరోవైపు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన కౌన్సిలర్లు కూడా తమ ప్రతివాదులు తప్పుడు సమాచారంతో కోర్టును ఆశ్రయిస్తున్నారని హైకోర్టులో కెవిట్ వేసినట్లు తెలిసింది. వాదప్రతివాదనల విన్న హైకోర్టు న్యాయమూర్తి చైర్‌పర్సన్ వినీత వేసిన రిట్ పిటిషన్‌ను కొట్టేసినట్లు తెలిసింది.

ఏఆర్‌ఎస్సై దేవిసింగ్ సస్పెన్షన్..?

ఖలీల్‌వాడి : నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ ఎస్సై దేవిసింగ్‌ను గురువారం సస్పెండ్ చేసినట్లు సమాచారం..? రెండు నెలల క్రితం నా లుగో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏఆర్‌ఎస్సై కుమారుడు ఇంటి బయట వ్యక్తులతో గొడవ పడుతుండగా, ఏఆర్‌ఎస్సై కూడా వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో బాధితులు ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీపీ విచారణ చేయించి తర్వాత ఏఆర్‌ఎస్సైను సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

వడ్డె ఓబన్న ఆశయ సాధనకు కృషి



సుభాష్‌నగర్ : స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న ప్రదర్శించిన ధైర్య సాహసాలు అనన్య సామాన్యమైనవని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పేర్కొన్నారు. వడ్డె ఓబన్న 208వ జయంతి పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వడ్డె ఓబన్న చిత్రపటానికి కలెక్టర్ సహా అధికారులు నివాళులు అర్పించారు. రేనాడు ప్రాంతంలో జన్మించిన ఓబన్న ఆనాడు బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జరిపిన సాయుధ పోరులో సైన్యాధ్యక్షుడిగా వీరోచిత పోరాటం చేశారన్నారు. అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి రమేష్, ఆయా సంఘాల ప్రతినిధులు దండి వెంకట్, పి వెంకటేష్, నగేష్, శంకర్, బుస్స ఆంజనేయులు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

19న జెడ్పీ సర్వసభ్య సమావేశం

నిజామాబాద్ నాగారం : జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 19న ఉదయం 10.30 గంటలకు జెడ్పీ హాలులో ఉంటుందని జెడ్పీ సీఈవో గోవింద్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ సర్వసభ్య సమావేశం చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అధ్యక్షతన జరుగుతుందన్నారు. జిల్లాలోని రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, ఎంపీ అర్వింద్, బీబీపాటిల్, ఎమ్మెల్యేలు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులందరూ హాజరుకావాలన్నారు.

సెలవులిచ్చారోచ్..

సంక్రాంతి పండుగంటే చిన్నారుల్లో ఎక్కడలేని ఆనందం కనిపిస్తోంది. వరుస సెలవులు ప్రకటించడంతో జిల్లావ్యాప్తంగా హాస్టళ్లలో, అద్దె గదుల్లో ఉంటూ చదువుకునే విద్యార్థులు సొంతూళ్లకు పయనమయ్యారు. హాస్టళ్లలో ఉండే చిన్నారులను వారి తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



విద్యార్థులకు సెలవులు ప్రకటించడంతో కిక్కిరిసిపోయిన నిజామాబాద్ ప్రధాన బస్టాండ్ ప్రాంగణం

బరిలో నిలిచేనా?

- బీఆర్‌ఎస్ పార్లమెంట్ స్థాయి సమీక్షలో మాజీల తీరుపై ఏకరువు పెట్టిన కవిత !
- పార్టీ స్థానిక కమిటీల్లో అసమర్థుల ఎంపిక
- కవిత ఓడినప్పుడు ఇలాంటి సమీక్ష ఎందుకు పెట్టలేదని ప్రశ్నించిన కార్యకర్తలు
- నోరు విప్పని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఉద్యమకారులకు మాట్లాడే అవకాశమివ్వని వైనం
- పార్టీ బాధ్యతలైనా ఇవ్వాలంటూ డిమాండ్

మాజీ ఎమ్మెల్యేలు ముఖ్యమైన ప్రభుత్వ పథకాలను సొంత కోటరీలోని వారికే ఇచ్చుకున్నారు.. అసలైన అర్హత కలిగిన కార్యకర్తలను మాత్రం విస్మరించారంటూ పార్టీ పార్లమెంట్ స్థాయి సమీక్షలో ఎమ్మెల్సీ కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలు కేటీఆర్‌తో, తనతో గానీ దిగిన ఫొటోలు స్టేటస్, డీపీలుగా పెట్టుకుంటే తొలగించేలా ఒత్తిడి చేశారని నిరసించారు.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల బరిలో ఎమ్మెల్సీ, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత బరిలో నిలిచే విషయమై ఇప్పటివరకు ఒక స్పష్టత లేకుండా పోయింది. మరోవైపు పార్టీ శ్రేణుల్లో సైతం లోక్‌సభ ఎన్నికల ముందు నిర్వేదం అలుముకుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 8న హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగిన నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో కార్యకర్తలతో పాటు కవిత మాజీ ఎమ్మెల్యేల గురించి ఏకరువు పెట్టడం గమనార్హం.

మాజీ ఎమ్మెల్యేలు సొంతంగా కోటరీ ఏర్పాటు చేసుకుని ముఖ్యమైన ప్రభుత్వ పథకాలను ఆ కోటరీలోని వారికే ఇచ్చుకున్నారని, అసలైన అర్హత కలిగిన కార్యకర్తలకు ఇవ్వలేదని కవిత ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. అదేవిధంగా ఆయా నియోజకవర్గాల్లో తాము లేనప్పుడు తనను పర్యటించవద్దని మాజీ ఎమ్మెల్యేలు కొందరు అడ్డుకున్నారని కవిత పేర్కొనడం విశేషం. చివరకు పార్టీ స్థానిక కమిటీల్లో చేతకాని వారినే నియమించడంతో పార్టీ చతికిలపడిందని అన్నట్లు సమాచారం. కార్యకర్తలు కేటీఆర్‌తో కానీ, తనతో కానీ ఫొటోలు దిగి స్టేటస్, డీపీలుగా పెట్టుకున్న సందర్భంలోనూ వాటిని తీసేసేలా మాజీ ఎమ్మెల్యేలు కొందరు ఒత్తిడి చేశారని కవిత నిరసన వ్యక్తం చేశారు. ఇకపై జిల్లా, మండల, నగర, పట్టణ కమిటీలను రాష్ట్ర పార్టీ నాయకత్వమే నియామకం చేసేలా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సమీక్షలో కవిత వ్యాఖ్యానించారు.

సమీక్ష సమావేశంలో తమకు మాట్లాడే అవకాశం కల్పించాలని చిట్టీలు పంపినప్పటికీ అవకాశమివ్వలేదని పలువురు ఉద్యమకారులు పేర్కొన్నారు. తాము ఏళ్లతరబడి ఉద్యమాలు చేస్తే అధికారం వచ్చిన తరువాత వచ్చిన వారికి అన్ని అవకాశాలు కల్పించారని, అధికారం చేజారింది కనుక వాళ్లంతా మధ్యలోనే వెళ్లిపోతారంటున్నారు. ఇప్పటికైనా సరే మొదటి నుంచి ఉద్యమంలో ఉన్నవారికే జిల్లా పార్టీల బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు నామినేటెడ్ పదవులు కాదు కదా తమకు కనీసం గుర్తింపు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా ఉద్యమకారులకే పార్టీ పదవులు అప్పగిస్తే భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.

కార్యకర్తల్లో నిర్వేదం..

అధికారంలో ఉన్న సమయంలో ఎమ్మెల్యేల వ్యవహారంపై రగిలిపోయిన కార్యకర్తల్లో ప్రస్తుతం అధికారం చేజారిన తరువాత మరింతగా నిర్వేదం నెలకొంది. అదేవిధంగా పార్లమెంట్ పార్టీ సమీక్ష సమావేశంలో కవిత మాట్లాడిన అంశాలు, కార్యకర్తల నుంచి వచ్చిన స్పందన, కేటీఆర్ మౌనం నేపథ్యంలో కవిత బరిలో ఉంటారా లేదా అనే విషయమై ఏమాత్రం స్పష్టత లేకుండా పోయింది.

కవిత ఎంపీగా ఓడినప్పుడు..

సమీక్ష సమావేశంలో 20 మందికి పైగా కార్యకర్తలు మాట్లాడారు. కవిత గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా ఓటమిపాలైనప్పుడు గానీ, గత పదేళ్ల కాలంలోనూ ఈ విధంగా కార్యకర్తలతో సమీక్ష సమావేశాలు ఎందుకు పెట్టలేదని కార్యకర్తలు ప్రశించారు. ఇప్పుడు అధికారం చేజారింది కనుక ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యకర్తలు ఇలాంటి ప్రశ్నలు సంధించిన సమయంలో పార్టీ శ్రేణులు ఈలలు, కేకలు వేయడం విశేషం. తరచూ ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేస్తే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదని కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అన్నారు. అధికారం ఉన్న సమయంలో ఎమ్మెల్యేలు తమను ఏమాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలతో పాటు కవిత అనేక అంశాల గురించి మాట్లాడినప్పటికీ కేటీఆర్ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం పట్ల శ్రేణుల్లో అసహనం వ్యక్తమవుతోంది.

జలం.. పాతాళం

- జిల్లాలో అడుగంటుతున్న భూగర్భ జలాలు
- నెల రోజుల్లోనే మీటరున్నర లోతులోకి..
- బాల్కొండ, సిరికొండ మండలాల్లో మరింత కిందికి..



డొంకేశ్వర్(ఆర్మూర్) : వేసవి రాకముందే జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ముప్పెక్కి పైగా ప్రాంతాల్లో అనుకోని స్థాయిలో నీటి మట్టాలు కిందికి వెళ్లాయి. గడిచిన నెల రోజుల్లోనే సగటున మీటరున్న లోతులోకి జలాలు ఇంకిపోవడం ఆందోళన కలిగిస్తోంది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే కూడా 1.23 మీటర్లు కిందికి వెళ్లినట్లు భూగర్భజల శాఖ గణాంకాలు చెప్తున్నాయి. ప్రధానంగా భీమ్‌గల్, సిరికొండ మండలాల్లో భూగర్భ జలాలు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. అత్యధికంగా మెండోరాలో 5.84, అలాగే ముషీర్‌నగర్, సిరికొండలో 5.42 మీటర్ల చొప్పున లోతుకి వెళ్లాయి. అయితే, యాసంగి వరినాట్లు కూడా దాదాపు పూర్తి కావడంతో ఇకనుంచి వ్యవసాయ బోర్ల వాడకం పెరగనుంది. మే నెల వరకు వ్యవసాయ బోర్లతో పాటు, తాగునీటి బోర్ల వాడకం ఎక్కువగా ఉండనుంది. తద్వారా భూగర్భ జలాలు మరింత వేగంగా కిందికి వెళ్లనున్నాయి. ప్రస్తుత గణాంకాల ప్రకారం నవంబర్ నెలలో 7.22 మీటర్ల లోతులో ఉన్న జలం, డిసెంబర్ ముగిసే నాటికి 8.73 మీటర్ల లోతుకి పడిపోయాయి. జిల్లాలో మొత్తం 81 ఫీజో మీటర్లు ఉండగా, 25 ఫీజో మీటర్లు ఉన్న ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే వేసవి నాటికి సాగు,తాగునీటికి కొరత ఏర్పడే అవకాశం ఉంటుంది. బోర్లు వట్టిపోయి సిరికొండ, బాల్కొండ లాంటి మండలాల్లో కరువు వచ్చే అవకాశాలు ఉంటాయని అంచనా వేయవచ్చు. భూగర్భ జలాలను కాపాడుకునేందుకు నీటిని పొదుపుగా వాడుకోవడమే ప్రజల ముందున్న ఏకైక మార్గమని భూగర్భ జలశాఖ ఉప సంచాలకులు ఆర్ దేవేంద్ర ప్రసాద్ సూచిస్తున్నారు.

జలాలు లోతులోకి వెళ్లిన ప్రాంతాలు..

ప్రాంతం	మీటర్లు	ప్రాంతం	మీటర్లు	ప్రాంతం	మీటర్లు	ప్రాంతం	మీటర్లు
						హొన్నాజీపేట్	2.49
మెండోరా	5.84	భీమన్‌పల్లి	4.29	గోనుగొప్పుల	3.22	పాలెం	2.43
ముషీర్‌నగర్	5.42	తాళ్లపల్లి	4.17	సాలూరా	3.03	పల్లికొండ	2.20
సిరికొండ	5.42	గడ్కోల్	3.90	పెద్ద వాల్గోట్	2.89	యానంపల్లి	2.08
రామన్నపేట్	4.54	దూపల్లి	3.74	గుమ్మిర్యాల్	2.58	సంగెం	2.05
అంక్సాపూర్	4.29	కోటగిరి	3.67	కమ్మర్‌పల్లి	2.57	బాద్గుణ	2.00

జాకోరా సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాసం నోటీసు

వర్ని : వర్ని మండలంలోని జాకోరా సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డిపై అదే పార్టీకి చెందిన 9 మంది విండో డైరెక్టర్లు అవిశ్వాసానికి ప్రణాళిక వేశారు. ఈ సందర్భంగా ఆయనపై అవిశ్వాస తీర్మానం నోటీస్‌ను హైదరాబాద్‌లోని సహకార సంఘం కమిషనర్‌కు ఈనెల 9వ తేదీన సంఘ సభ్యులు అందజేశారు. సహకార సంఘంలో 13 మంది డైరెక్టర్లు ఉండగా 9 మంది బీఆర్‌ఎస్, నలుగురు కాంగ్రెస్ డైరెక్టర్లు ఉన్నారు. వీరిలో ఇటీవలే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సంఘం డైరెక్టర్, సిద్దాపూర్ సర్పంచ్ భర్త దశరథ్ బీఆర్‌ఎస్ పార్టీ సభ్యులతో కలిసి చైర్మన్ కృష్ణారెడ్డిపై అవిశ్వాస తీర్మానం చేస్తూ నోటీస్‌ను కమిషనర్‌కు అందజేశారు. నలుగురు కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్లతో పాటు 9 మంది బీఆర్‌ఎస్ పార్టీ డైరెక్టర్లు కూడా అవిశ్వాస తీర్మానానికి ప్రణాళిక వేసిన దశరథ్‌కు మద్దతు తెలుపనున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 9 మంది డైరెక్టర్లు ఇప్పటికే దశరథ్ క్యాంప్‌లో ఉన్నట్లు తెలిసింది. కమిషనర్‌కు అవిశ్వాసం నోటీస్‌కు అందజేసిన సభ్యులకు 15 రోజుల గడువు విధించినట్లు తెలిసింది. దీనిని బట్టి చూస్తుంటే బీఆర్‌ఎస్‌కు పెద్దదెబ్బే తగిలినట్లు స్పష్టమవుతోంది.

హరితహారం లక్ష్యసాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : హరితహారంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో హరితహారం కార్యక్రమంపై అన్ని శాఖల జిల్లా అధికారులు, సీపీ కల్మేశ్వర్, డీఎఫ్‌వో వికాస్ మీనాతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల వారీగా హరితహారం కింద నాటాల్సిన మొక్కల లక్ష్యాలను నిర్దేశిస్తూ ప్రతిపాదనలు రూపొందించారు. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వ ఆమోదం నిమిత్తం పంపిస్తున్నామన్నారు. ఆయా శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించేందుకు చొరవ చూపాలన్నారు. ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని, నిర్ణీత గడువు లోపు లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు. 2023–24కు సంబంధించిన లక్ష్యాల సాధన కోసం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, హరితహారం అమలు తీరును పకడ్బందీగా పర్యవేక్షించాలన్నారు. రోడ్ల కిరువైపులా ఖాళీ ప్రదేశాల్లో నాటిన మొక్కలను గమనించి వాస్తవ పరిస్థితులతో కూడిన నివేదికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మొక్కలకు జియో ట్యాగింగ్ ప్రక్రియ కూడా పూర్తి చేయాలన్నారు.

పోలీస్‌శాఖకు మొక్కలు పెంచేందుకు వీలుగా సరిపడా స్థలం లేనందున, నగర శివారులో ఐదెకరాల రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాను కేటాయిస్తామని, ఆ స్థలంలో మొక్కలు నాటేందుకు చొరవ చూపాలని డీఎఫ్‌వో వికాస్ మీనా కోరారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ మకరందు, అదనపు డీసీపీ జయరాం, ప్రొబేషనరీ ఐపీఎస్ చైతన్య, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో చందర్, డీపీవో జయసుధ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ముగిసిన కబడ్డీ టోర్నీ

- ఫైనల్స్ విజేత హర్యానా జట్టు
- ద్వితీయ స్థానంలో కర్ణాటక
- తృతీయస్థానంతో సరిపెట్టుకున్న తెలంగాణ
- ఆద్యంతం ఉత్కంఠగా సాగిన అండర్-17 జాతీయ కబడ్డీ టోర్నీ



తృతీయ స్థానం ట్రోఫీ అందుకుంటున్న తెలంగాణ జట్టు



టోర్నీ విజేత హర్యానా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణా రెడ్డి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–17 జాతీయ స్థాయి కబడ్డీ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఈనెల 7న ప్రారంభమైన టోర్నీ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. పోటీల్లో 28 రాష్ట్రాల నుంచి జట్లు పాల్గొన్నాయి. చివరి రోజు జరిగిన ఫైనల్స్‌లో హర్యానా విజేతగా నిలవగా, కర్ణాటక ద్వితీయ స్థానంలో నిలిచింది. తెలంగాణ తృతీయ స్థానంతో సరిపెట్టుకుంది.

హోరాహోరీ పోరులో..

గురువారం జరిగిన ఫైనల్స్‌లో పోరులో కర్ణాటక – హర్యానా జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఆద్యంతం వీక్షకుల్లో ఉత్కంఠ ఏర్పడింది. ఆట ప్రారంభం కాగానే హర్యానా జట్టు కాస్త పాయింట్లు ఎక్కువగానే సాధించిన ఆ తర్వాత కర్ణాటక జట్టు అంతే దీటుగా పోటీ ఇచ్చింది. ఫస్టాఫ్‌లో 30- 33 పాయింట్లతో ఉండగా ఆ తర్వాత సెకండాఫ్‌లో తీవ్ర ఉత్కంఠ రేపేలా ఇరు జట్లు ఆడాయి. ఈ క్రమంలో కర్ణాటక జట్టు పాయింట్లు సాధించుకుంటూ హర్యానా ఆటగాళ్లను ఆల్ అవుట్ చేసింది. దీంతో కర్ణాటక జట్టు విజయం సాధిస్తుందని ప్రేక్షకులు భావించారు. ఆ తర్వాత నిలదొక్కుంటూ వచ్చిన హర్యానా జట్టు బోనస్ పాయింట్లు సాధించుకుంటూ ముందుకుసాగింది. కోర్టులో ఇద్దరు మాత్రమే మిగిలి ఉన్నా.. చివరి క్షణంలో అంకుష్ అనే ఆటగాడు సూపర్ టాకిల్ చేసి జట్టులో ఉత్సాహం నింపాడు. అక్కడి నుంచి పాయింట్లు పెంచుకుంటూ 51–49పాయింట్లతో హర్యానా జట్టు విజయం సాధించింది. కర్ణాటక ద్వితీయ స్థానానికి పరిమితమైంది.

తెలంగాణ-ఢిల్లీ మధ్య ఉత్కంఠపోరు

టోర్నీలో మూడో స్థానం పోటీకోసం సెమీస్‌లో ఓడిన తెలంగాణ – ఢిల్లీ జట్టు గురువారం మొదటి మ్యాచ్‌లో పోటీ పడ్డాయి. పోటీల్లో మొదటి నుంచి తెలంగాణ పాయింట్లు సాధించుకుంటూ వచ్చింది. మధ్యలో ఢిల్లీ సైతం ఉత్కంఠ రేపేలా ఆడింది. కానీ చివరకు 41–25 పాయింట్లతో తెలంగాణ జట్టు విజేతగా నిలిచి టోర్నీలో తృతీయ స్థానాన్ని దక్కించుకుంది.

క్లుప్తంగా

ట్రస్మా నూతన కార్యవర్గం ఎన్నిక

నిజామాబాద్‌అర్బన్‌: ట్రస్మా అర్బన్‌ నూతన కార్యవర్గం గురువారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా ధర్మరాజు, కార్యదర్శిగా శ్రీనివాస్‌, కోశాధికారిగా నాగరాజు ఎన్నికైనట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు జయసింహ తెలిపారు. పూర్తి కార్యవర్గాన్ని త్వరలో ఎన్నుకుంటామని అన్నారు. ఎన్నికల అధికారిగా మామిడాల మోహన్‌ వ్యవహరించారు.

23 నుంచి పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పీజీ రెగ్యులర్‌ సెమిస్టర్‌ పరీక్షలు ఈ నెల 23 నుంచి ప్రారంభం అవుతాయని పరీక్షల నియంత్రణాధికారి అరుణ గురువారం తెలిపారు. ఈనెల 20 నుంచి ప్రారంభం కావాల్సిన పరీక్షలు విద్యార్థుల కోరిక మేరకు 23నుంచి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. పీజీ 5, 7, 9వ సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలు ఫిబ్రవరి 2వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. పూర్తి వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

కళాశాలల్లో యాంటీడ్రగ్స్‌ కమిటీలను ఏర్పాటు చేయాలి

బోధన్‌టౌన్‌: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్‌ జూనియర్‌, డిగ్రీ కళాశాలల్లో యాంటీడ్రగ్స్‌ నివారణ కమిటీలను ఏర్పాటు చేయాలని ఏసీపీ కిరణ్‌కుమార్‌ సూచించారు. గురువారం పట్టణ పీఎస్‌ ఆవరణలో కళాశాల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. కళాశాలలకు వచ్చే విద్యార్థులపై ఉపాధ్యాయులు, కళాశాల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడకుండా వారు చేసే పనులపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. సమావేశంలో సీఐ వీరయ్య, సిబ్బంది ఉన్నారు.

17 నుంచి సర్టిఫికెట్‌ వెరిఫికేషన్‌

నిజామాబాద్‌అర్బన్‌: డీఈఈ సెట్‌లో ప్రవేశాల కోసం జిల్లా కేంద్రంలోని డైట్‌ కళాశాలలో ఈనెల 17 నుంచి రెండో విడత సర్టిఫికెట్‌ వెరిఫికేషన్‌ ఉంటుందని డీఈవో దుర్గాప్రసాద్‌ గురువారం పేర్కొన్నారు. 18 నుంచి 22వ తేదీ వరకు పొందిన ర్యాంకు ప్రకారం అభ్యర్థులు కళాశాలలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. 25న విద్యార్థులకు సీట్లు వారి మెరిట్‌, రిజర్వేషన్‌ ఆధారంగా కేటాయించడం జరుగుతుందన్నారు. 26 నుంచి 29 వరకు కళాశాలలకు విద్యార్థులు రిపోర్ట్‌ చేసి ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 31న మెరిట్‌ ఆధారంగా సీట్లకు ఏ టైం కు జరుగుతుందన్నారు ఫిబ్రవరి 1 నుంచి 3లోపు విద్యార్థులు సంబంధిత కళాశాలలో రిపోర్ట్‌ చేయాల్సి ఉంటుందన్నారు.

పతంగుల వేళ.. పిల్లలూ జాగ్రత్త

- చైనా మాంజాతో పొంచిఉన్న ప్రమాదం
- తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి
- మాంజాతో పక్షులకూ ఇబ్బందులే..



నిజామాబాద్‌ రూరల్‌/రాజంపేట: నేటి నుంచి పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో పిల్లల్లో ఎక్కడలేని ఆనందం కనిపిస్తుంది. చిన్నాపెద్దా తేడాలేకుండా పతంగులు ఎగరేసేందుకు ఆసక్తి కనబరుస్తుంటారు. కాని చైనామాంజా కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిసినా ఇష్టారాజ్యంగా మాంజా అమ్ముతున్నారు. ఆ మాంజాతో పతంగులు ఎగరేస్తే చిన్నారులతో పాటు పక్షులకు కూడా ప్రమాదం పొంచి ఉంది. జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్‌ వద్ద రోడ్డుకు ఇరువైపులా పతంగీల దుకాణాలు వెలిశాయి.

ఉమ్మడి జిల్లాలో ని అన్ని ప్రాంతాల్లో పతంగుల దుకాణాలు సందడిగా మారాయి. దుకాణాల్లో గాలిపటాలు, మాంజాలతో పాటు దారాలు, క్యాండిల్స్‌, ప్యారాషూట్‌, ఫ్యాన్సీ ఐటెంలు, చరఖా, త్రెడ్‌ చెరఖా, చిన్నపిల్ల ఫ్యాన్సీ ఐటెంలు విక్రయానికి సిద్ధం చేశారు.

అవగాహన కల్పించాలి..

చైనా మాంజా పిల్లలు ఎక్కడ పడితే అక్కడ పడేయడంతో పక్షులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతాయి. వాటి కాళ్లకు చిక్కుకున్న చైనా మాంజా వదలకపోవడంతో అవి ప్రాణాలు కోల్పోతున్నాయి. వీటిపై తల్లిదండ్రులు చిన్నారులకు అవగాహన కల్పించాలి. ప్రమాదాల బారిన పడకుంటా ఎలా ఎగరేయాలనే విషయాలను చిన్నారులకు స్పష్టంగా చెప్పాలి.

సాదామాంజానే వాడాలి..

పతంగులు ఎగరేసేటప్పుటు చైనా మాంజాను కాకుండా సాదా మాంజానే వాడాలని నిపుణులు పేర్కొంటున్నారు. సాదా మాంజాతో పక్షులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవంటున్నారు. మాంజాల ధరలతో పోలిస్తే చైనా మాంజాలు ఒక చర్కా దాదాపు రూ. 300 నుంచి మొదలుకుని రూ.500 వరకు విక్రయిస్తున్నారు. సాధారణ మాంజాలు అందుబాటు ధరల్లోనే ఉన్నాయి. చెనా మాంజాలతో ప్రమాదం పొంచి ఉంది.

విద్యుత్‌ తీగలతో ప్రమాదం

భవనాలు, పిట్టగోడలు, బాల్కానీలపై నిలబడి పతంగులు ఎగరేసేటప్పుటు జాగ్రత్తలు పాటించాలి. చిన్నచిన్న గల్లీలు, భారీ భవన సముదాయాలు, విద్యుత్‌ తీగలు, సెల్ఫోన్‌ టవర్ల సమీపంలో గాలిపటాలు ఎగురవేసే సాహసం చేయకూడదు. పతంగులు విద్యుత్‌ తీగలు, స్తంభాలు, చెట్లపై పడితే తీసుకునే ప్రయత్నం చేయద్దు. ఇలా తీసుకునే ప్రయత్నంలో ప్రమాదాలకు చిన్నారులు ఎక్కువగా గురవుతున్నారు. రోడ్ల వెంట గాలిపటాలు కోసం పరుగులు పెట్టనీయవద్దు. పైగా రహదారులపై వెళ్తున్న వారి మెడకు బిగుసుకుపోవడంతో గొంతు దగ్గర గాయాలవుతున్నాయి. డాబాలపై కాకుండా మైదానాలను ఎంపిక చేసుకోవాలి.

చైనా మాంజాలు వాడొద్దు



ప్రస్తుతం సంక్రాంతి సెలవుల దృష్ట పిల్లలందరు ఇంటి వద్ద ఉండి గాలిపటాలు ఎగురవేస్తు ఉంటారు. ఈ నేపథ్యంలో చైనా మాంజాలకు ప్రాముఖ్యతనిస్తూ ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. చైనా మాంజాలకు స్వస్తిపలికి సాధారణ మంజాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలి.

– పోల వంశీ రెడ్డి, బర్దీపూర్‌

అమ్మితే చర్యలు



ప్రమాదకర మాంజాలు వాడినా, సరఫరా చేసినా వన్యప్రాణి సంరక్షణ చట్టం(1986) క్రింద జైలు శిక్ష లేదా రూ.లక్ష విధిస్తాం. పక్షులకు ప్రమాదం అని ప్రభుత్వం సింథటిక్‌ చైనా మాంజాలను నిషేధించింది. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించి పండగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి.

– రమేశ్‌, ఎఫ్‌ఆర్‌వో రాజంపేట

యూనియన్‌ బ్యాంక్‌పై బాధితురాలి విజయం

ఖలీల్‌వాడి: బ్యాంకులో జరిగిన అన్యాయానికి ఓ బాధితురాలు న్యాయ పోరాటం చేసి విజయం సాధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన దేమి సంగవ్వ టెంట్‌ హౌస్‌ స్వయం ఉపాధి నిమిత్తమై జిల్లా షెడ్యూల్డు కులాల కార్పొరేషన్‌ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. దీంతో నాటి కలెక్టర్‌ ఆధ్వర్యంలోని కమిటీ రూ.6 లక్షల రుణం అందించాలని ప్రొసీడింగ్స్‌ను 2018లో జారీ చేసి తాడ్వాయిలోని బ్యాంకుకు ఉత్తర్వులు పంపించారు. కానీ బ్యాంకర్‌ 2020 జనవరి 3న సంగవ్వ పేరున కాకుండా ఇతరుల పేరుపై రూ.3 లక్షల బ్యాంకు చెక్‌ను జారీ చేశారు. దీంతో బ్యాంకు వారు బాధితురాలి బ్యాంకు ఖాతా నుంచి మూడు వాయిదాలుగా రూ. 6660 వేలు లోన్‌ అకౌంట్‌కు బదిలీ చేసుకున్నారు. దీంతో ఆమె నిజామాబాద్‌ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో న్యాయస్థానం బ్యాంకు అధికారులకు నోటీసులు జారీ చేసింది. బాధితురాలికి రూ.6లక్షల లోన్‌ మంజూరు చేయాలని, లోన్‌ ఇవ్వకున్నా ఆమె బ్యాంకు ఖాతా నుంచి వాయిదాలలో తీసుకున్న రూ.6660 వేలకు 9 శాతం వడ్డీతో చెల్లించాలని, మానసిక వేదనకు గురి చేసినందుకు రూ.15 వేలు, రూ.3 వేలు ఖర్చులకు చెల్లించాలని కమిషన్‌ సభ్యులు నాగేశ్వరరావు తీర్పులో పేర్కొన్నారు.

దళిత బంధు నిధులు విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న నాయకులు, లబ్ధిదారులు

సుభాష్‌నగర్‌: గత ప్రభుత్వం ఎంపిక చేసిన రెండో విడత దళితబంధు లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్‌ చేశారు. ఈమేరకు కలెక్టరేట్‌ ఎదుట లబ్ధిదారులతో గురువారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి, ఫ్లకార్డులు ప్రదర్శించారు.

అనంతరం కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతును తన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. దళితబంధు పథకం లబ్దిదారులను ఎంపిక చేసి ఖాతాల్లో డబ్బులు వేశారని, వెంటనే చేసిన ఫ్రీజింగ్‌ను ఎత్తేయాలన్నారు. దళితుల అభ్యున్నతికి, ప్రతి దళిత కుటుంబం ఆర్థికపరంగా, వ్యాపారపరంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్‌ పథకాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండి వైఖరిని వీడాలని, లేకుంటే కుటుంబాలతో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నిజామాబాద్‌ అర్బన్‌, రూరల్‌ నియోజకవర్గాల నాయకులు దండు చంద్రశేఖర్‌, పాశం కుమార్‌, అదరంగి భూమయ్య, పద్మారావు, భూషణ్‌, లింగం, విజయ్‌, మల్యాల గోవర్ధన్‌, మోహన్‌, పృథ్వీ, అంజయ్య, అల్వాల బుచ్చమ్మ, గీత తదితరులు పాల్గొన్నారు.





సంక్రాంతికి.. సొంతూరికి..

సంక్రాంతి సందర్భంగా విద్యా సంస్థలకు శుక్రవారం నుంచి సెలవులు ఉండటంతో గురువారం విద్యార్థులు సొంతూర్లకు పయనమయ్యారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు స్వగ్రామాలకు బయలుదేరడంతో బస్టాండ్‌లో రద్దీ నెలకొంది.

– సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌





ఆకట్టుకున్న కుస్తీపోటీలు



నిజాంసాగర్‌(జుక్కల్‌): ఎలామస పండుగ ఉత్సవాల్లో భాగంగా జుక్కల్‌ మండలం పెద్దగుల్లా గ్రామంలో మల్లయోధుల కుస్తీ పోటీలు గురువారం హోరాహోరీగా కొనసాగాయి. సర్పంచ్‌ వినోద్‌ ఆధ్వర్యంలో మల్లయోధులకు కుస్తీ పోటీలు నిర్వహించారు. విజేతలకు వెండి కడియాన్ని బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో గుల్లా సర్పంచ్‌ విఠల్‌ పటేల్‌, కల్లాలి సర్పంచ్‌ రమేష్‌దేశాయ్‌, సాయిలు, వినోద్‌, గంగాధర్‌నాయక్‌, చంద్రకాంత్‌నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌ దరఖాస్తుపై ఆర్డీవో విచారణ



కమ్మర్‌పల్లి: ప్రజాదర్బార్‌ సీఎం పేషీలో ఇచ్చిన దరఖాస్తుపై ఆర్మూర్‌ ఆర్డీవో వినోద్‌ కుమార్‌ హాసకొత్తూర్‌లో గురువారం విచారణ చేపట్టారు. మండలంలోని హాసకొత్తూర్‌కు చెందిన పాలెపు రాజేశ్వర్‌ ఇందిరమ్మ కాలనీలోని ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలు జరిగాయని, చెరువులు, కుంటల స్థలాలు సైతం కబ్జాకు గురయ్యాయని ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేయగా ఆర్మూర్‌ ఆర్డీవో వినోద్‌కుమార్‌ విచారణ చేపట్టారు. ఇందిరమ్మ కాలనీలో నిర్మించిన ఇళ్లను పరిశీలించారు. జీపీ కార్యదర్శిని పిలిచి అనర్హులు ఎవరైనా ఇళ్ల నిర్మాణం చేపట్టారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ధ్రువపత్రాలు లేని వారికి నిర్మాణం కోసం అనుమతులు ఇవ్వరాదని ఆదేశించారు. అదేవిధంగా పటేల్‌ కుంట చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. జాయింట్‌ సర్వే చేసి భూమి ఆక్రమణ జరిగిందో లేదో తేల్చాలని ఇరిగేషన్‌, రెవెన్యూ సర్వేయర్‌లను ఆదేశించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్‌ ఆంజనేయులు, ఆర్‌ఐ శరత్‌, ఉప సర్పంచ్‌ రాజేశ్వర్‌ ఉన్నారు.

క్రైం కార్నర్‌

వేటగాళ్ల పట్టివేత



వర్ని: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కాకులను వేటాడుతున్న ఇద్దరిని పట్టుకున్నట్లు అటవీశాఖ డిప్యూటీ రేంజ్‌ ఆఫీసర్‌ బాబు గురువారం తెలిపారు. తినుబండారాల్లో విషపూరిత కెమికల్స్‌ కలిపి కాకులకు ఎరగావేసి పట్టుకుంటున్నట్లు స్థానికుల ద్వారా సమాచారం అందడంతో వారిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కాకులను హోటళ్ల, దాబాల్లో విక్రయిస్తున్నారా లేదా ఇతర మందుల తయారీకి వాడుతున్నారా అన్న విషయాలపై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట మోస్రా సెక్షన్‌ ఆఫీసర్‌ ప్రభాకర్‌, అటవీ సిబ్బంది ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

బోధన్‌టౌన్‌: పట్టణంలోని రంగరీగల్లీలో పేకాటస్థావరంపై దాడి చేసినట్లు సీఐ వీరయ్య గురువారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు బుధవారం రాత్రి పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి 9 మందిని అరెస్టు చేసి ఆర్డీవో రాజాగౌడ్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు పేర్కొన్నారు. దాడిలో వారి నుంచి రూ. 38 వేల నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బస్వాపూర్‌లో..

రుద్రూర్‌: కోటగిరి మండలం బస్వాపూర్‌ శివారులో పేకాటస్థావరంపై దాడి ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్సై సందీప్‌ గురువారం తెలిపారు. వీరి నుంచి రూ.2500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

వాడిలో కూలీ అదృశ్యం



వేల్పూర్‌: వాడి గ్రామంలో మేస్త్రీ వద్ద కూలీపని చేసే మునుకుంట్ల మధు అనే వ్యక్తి గత డిసెంబర్‌ నెల 29న అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్‌కుమార్‌ గురువారం తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన మధు బతుకు దెరువు నిమిత్తం పచ్చలనడ్కుడలో సత్యం అనే మేస్త్రీ వద్ద కూలీ పని చేయడానికి డిసెంబర్‌లో వచ్చాడు. ఐదు రోజులు పనిచేసిన తర్వాత అదృశ్యమైనట్లు చెప్పారు. మధు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చైనా మాంజాలు అమ్మితే చర్యలు



కామారెడ్డి అర్బన్‌: గాలిపటాలు ఎగురవేయడానికి అతి ప్రమాదకరమైన నైలాన్‌, మాంజాలు విక్రయిస్తే తీవ్ర చర్యలుంటాయని జిల్లా ఫారెస్ట్‌ అధికారులు గాలిపటాలు అమ్మే దుకాణదారులను హెచ్చరించారు. అనంతరం పలువురు దుకాణదారులకు నోటీసులు అందజేశారు. మనుషులతో పాటు పక్షులు, జంతువులకు హానిచేసే మాంజాల తయారీ, విక్రయాలను ప్రభుత్వం నిషేధించిందని, అతిక్రమించిన వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అధికారులు ఫారుక్‌, అమరంజని, సురేశ్‌, పద్మారావు, దీపిక తదితరులు ఉన్నారు.

ఇటుక లారీ, ఆటో ఢీ



ఘటనా స్థలిలో ఆటో, లారీ





చికిత్స పొందుతున్న సుశీల్‌దేవ్‌, గుడ్డు పటేల్‌

- నలుగురికి తీవ్రగాయాలు, ఒకరి పరిస్థితి విషమం

మోపాల్‌: మండలంలోని కంజర్‌ శివారులో గురువారం ఉదయం ఇటుక లారీ, ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌తోపాటు లారీలో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయలు కాగా వీరలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిర్‌పూర్‌ గ్రామానికి చెందిన శేఖర్‌ తన ఆటోలో కంజర్‌ శివారులో ఉన్న శార్వాణీ పాఠశాలకు నలుగురు విద్యార్థులను తీసుకొచ్చాడు. వారిని పాఠశాలలో వదిలేసి రోడ్డుపైకి వస్తుండగా అదేసమయంలో మోపాల్‌ చౌరస్తా నుంచి కంజర్‌ వైపు ఇటుక లారీ అతివేగంగా వెళ్తోంది. రోడ్డుపైకి వస్తున్న ఆటోను లారీ డ్రైవర్‌ కృష్ణ గమనించలేదు. దీంతో అదే వేగంతో ఆటోను ఢీకొనడంతో లారీ బోల్తా పడింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్‌ శేఖర్‌, నర్సింగ్‌పల్లిచెందిన లారీ డ్రైవర్‌ కృష్ణతోపాటు ఒరిస్సా నుంచి వచ్చిన కూలీలు సుశీల్‌దేవ్‌ మహానంద్‌, గుడ్డు పటేల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో గుడ్డు పటేల్‌ పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదానికి లారీ డ్రైవర్‌ కృష్ణ అతివేగం, అజాగ్రత్తతో నడపడమే కారణమని పోలీసులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌హెచ్‌వో గంగాధర్‌ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. శేఖర్‌ తండ్రి సత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. కాగా ప్రమాదం జరగడంతో రోడ్డుపై ట్రాఫిక్‌ అంతరాయం ఏర్పడింది. పోలీసులు అక్కడే ఉండి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

తప్పిన పెను ప్రమాదం..

సిర్‌పూర్‌ నుంచి శేఖర్‌ ఆటోలో నలుగురు విద్యార్థులను తీసుకుని పాఠశాలలో వదిలేయడానికి బయలుదేరారు. ఆటోను లారీ ఢీకొన్న విషయం తెలియగానే విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. విద్యార్థులను పాఠశాలలో వదిలేసిన తర్వాత ప్రమాదం చోటుచేసుకుందని నిర్ధారించుకుని ఊపిరి పీల్చుకున్నారు. ఆటో డ్రైవర్‌ శేఖర్‌ ఒక్కరే గాయపడటంతో పెను ప్రమాదం తప్పిందని వారు పేర్కొంటున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి



చంద్రకళ మృతదేహం

ఆర్మూర్‌టౌన్‌: రోడ్డు దాటుతున్న ఓ మహిళను వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని చేపూర్‌ శివారులో గురువారం చోటు చేసుకుంది. చేపూర్‌ గ్రామానికి చెందిన సురంపల్లి చంద్రకళ(33) పెర్కిట్‌లో పని ముగించుకొని ఆటోలో చేపూర్‌ శివారులో దిగింది. రోడ్డు దాటే క్రమంలో హైదరాబాద్‌ నుంచి నిర్మల్‌ వైపు వెళ్తున్న కారు వేగంగా చంద్రకళను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి అన్న సుదర్శన్‌గౌడ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు తెలిపారు.

బస్సు ఢీకొని యువకుడు..

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌ సమీపంలో ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొనడంతో పత్తిరి సతీశ్‌ (18) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఘన్‌పూర్‌ గ్రామానికి చెందిన సతీశ్‌ గురువారం సాయంత్రం రైల్వేస్టేషన్‌ సమీపంలో రోడ్డును దాటుతుండగా అదే సమయంలో డిచ్‌పల్లి నుంచి నిజామాబాద్‌ వైపు అతివేగంగా వెళుతున్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు ఢీకొన్నది. ఈ ఘటనలో బస్సు టైర్లు అతని పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్‌ నాశెట్టి రవి బస్సును ఆపకుండా వేగంగా ముందుకు పోనిచ్చాడు. గమనించిన స్థానికులు బైక్‌లపై వెంబడించి కేఎస్‌ఆర్‌ గార్డెన్స్‌ వద్ద బస్సును అడ్డుకున్నారు. దీంతో డ్రైవర్‌ బస్సు దిగి పోలీసులకు లొంగిపోయాడు. మృతుడి నానమ్మ పత్తిరి భూమవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

లారీ ఢీకొని మరొకరు..

భిక్కనూరు: మండంలంలోని బస్వాపూర్‌ శివారులో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందినట్లు ఎస్సై సాయికుమార్‌ తెలిపారు. బస్వాపూర్‌ గ్రామానికి చెందిన తలారి ఎల్లేశ్‌(29) మండల కేంద్రంలో పనులు ముగించుకొని స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా జాతీయ రహదారిపై వెనుకనుంచి వస్తున్న లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో ఎల్లేశ్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బంధువుల అంత్యక్రియలకు వెళ్లి ఒకరు..



జక్రాన్‌పల్లి: మండలంలోని మునిపల్లి గ్రామానికి చెందిన గుడ్ల సురేశ్‌ (49) బంధువుల అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా మృత్యువాత పడ్డాడు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మునిపల్లికి చెందిన సురేశ్‌ ఆర్మూర్‌లోని ఎస్‌బీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. కాగా మునిపల్లిలో సురేశ్‌ బంధువులు అనారోగ్యంతో మృతిచెందగా అంత్యక్రియల కోసం స్కూటీపై మునిపల్లికి వచ్చి ఆర్మూర్‌కు వెళ్తుండగా జాతీయ రహదారిపై స్కూటీ అదుపు తప్పి కిందపడిపోయింది. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి మేనల్లుడు నవీన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మొరం టిప్పర్ల పట్టివేత



రుద్రూర్‌: కోటగిరి శివారులో అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. పక్కా సమాచారం మేరకు బుధవారం రాత్రి మొరం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి టిప్పర్లను పట్టుకొని పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా మొరం, ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉప్పల్‌వాయిలో వృద్ధుడి ఆత్మహత్య

రామారెడ్డి: ఉప్పల్‌వాయి గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు ఇంటి గొడవలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్‌ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన కొత్తోళ్ల భీమయ్య(60) వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.